# కాలం తీరిన కొలువు

లక్షింబాయి కళ్ళు తెరిచింది. మట్టి గోడలో పైగా ఉన్న చిన్న కిటికీలోంటి జల్లు పడుతోంది. ఆమె గబాలున లేచింది. నిద్ర, నిద్రలోని కల ఎగిరిపోయాయి. అమ్మ అప్పటికే లేచి పనిలోకి వెళ్ళిపోయిందని గుర్తుకొచ్చింది. చల్లగా చినుకులు ఒకటిరెండు మీద పడగానే తడక కిటికీని మూసివేసింది. గది చీకటైంది. ఓరగా వున్న తడక తలుపు తీసి బయటికి చూసింది. నిలచి కురుస్తోంది వాన. అమ్మ తడిసిపోతూ వెళ్ళిందేమో! డబ్బు సంచీలో భద్రంగా పెట్టుకుందో లేదో!

డబ్బు మాట తలుచుకుంటే గుండె బరువెక్కిపోయింది లక్షింబాయికి. రెండు వేల రూపాయలు తనెప్పుడూ అన్ని రూపాయలు కళ్ళతో చూడలేదు. పెట్టెలో అట్టడుగున పాత బట్టలో మూటగా కట్టి పడేసిన బంగారు గుళ్ళు రెండు అమ్మేస్తే వచ్చిన డబ్బు అది. ఆ డబ్బులిస్తే లక్షింబాయికి ఆస్పత్రిలో ఆయా ఉద్యోగం దొరుకుతుంది.. అది కూడా ఉద్యోగం కొనుక్కోవడానికి కాదు ఇంటర్వ్యూ పిలుపు రావడానికి ఎంప్లాయి మెంటు కార్డు తీసి నంబరు ఆస్పత్రికి పంపడానికే!

నాలుగేళ్ళయి తిరుగుతోంది ఆ ఆఫీసు చుట్టూ కొమరమ్మ భర్త దేశాల వెంటపడిపోతే, కొడుకునీ, కూతుర్నీ కూడా ఏదో కాస్త చదివించేటప్పటికి ఆమె శక్తి పూర్తయిపోయింది. అబ్బాయి ఏడో క్లాసులోనే ఫెయిలయిపోయాడు. అంతకు మునుపు టైలర్ షాపులో కొలువుకు పెడితే, అక్కడ కత్తెర్లు, చిల్లర డబ్బులు ఎత్తుకొచ్చి దెబ్బలు తిని బయటపడ్డాడు.

ఇంకెవరో తెలిసిన వాళ్ళింట్లో పెడితే, రేషన్ కార్డు, డబ్బు కాజేశాడు. కొమరమ్మ ముఖం చూసి, వాడిని చావగొట్టకుండా, పోలీసులకి అప్పగించ కుండా వదిలిపెట్టారు. అవన్నీ తలుచుకుంటే లక్షింబాయికి అమ్మ మీద జాలి ముంచుకొస్తుంది. పాపం,నెత్తిన చెంగు వేసుకుని వానకు తడుస్తూ వెళ్ళి ఉంటుంది. ఎంప్లాయిమెంటు ఆఫీసరు తన ఇంటికే చీకటితో తీసుకొచ్చి ఇమ్మన్నాడు. అందుకే చీకటి లెక్కచేయకుండా వాన, బురద, ఒంట్లో ఎప్పుడూ కాపురముండే జ్వరం పట్టించుకోకుండా కొమరమ్మ వెళ్ళిపోయింది.

అమ్మ తనని లేపలేదు. పోనీ అమ్మ కొలువు చేసే ఇళ్ళకు పోయి బాసన్లయినా తోమితే ఆమెకు కొంచెం నిమ్మళ ముంటుందనిపించింది లక్షింబాయికి. లేచి మెల్లగా పళ్ళు తోమింది. కడుపులో ఆకలవుతోంది. కాని మంచినీళ్ళయినా గొంతులో పోసుకోకుండా వెళ్ళిన అమ్మను తలుచుకుంటుంటే టీ కూడా చేసుకోబుద్ధి కావడం లేదు. తల దువ్వుకొని, నైలాను ఓణీ వేసుకుంది. నిన్న రాత్రి సైకిలాయన దగ్గర పోయించుకున్న పాలు కూడా గ్లాసులో స్టవ్ పక్కనే ఉన్నాయి. అమ్మ స్టవ్ కూడా ముట్టించలేదు.

తడిక తలుపు లాగి గొళ్ళెం పెట్టి చిన్న తాళం వేసింది. గోనె పట్టా తలమీద వేసుకుంది. పక్కన గుడిసె ముందు యాదమ్మ, పద్మమ్మ బొగ్గుతో పళ్ళు తోముతున్నారు. వాన కురుస్తుండటంతో ఎవ్వరూ బయటికి రావటం లేదు. "మా అమ్మ ఎప్పుడు పోయిందో చూశారా?" అన్నది లక్షింబాయి. "నాకేమెరికె?" అన్నది నోట్లో వేలు తీయకుండా యాదమ్మ. లక్షింబాయి పదో క్లాసు ప్యాసయినా కూడా ఇంకా ఏదీ చేయకుండా ఉండడం వాళ్ళకి ఆశ్చర్యంగా ఉంటుంది. 'సదివితే మంచి కొలువులొస్తాయంట' అని ఎప్పుడూ వింటుంటారు. కానీ చదివి, ప్యాసై రెండేళ్ళయినా లక్షింబాయి బాసన్లు తోముతూ, ఇంటింటి కూడు ఎందుకు తింటుందో వాళ్ళకి అర్థం కాదు.

రబ్బరు చెప్పులు పైకి బరద చిమ్ముతోంటే చినుకుకు చినుకుకు మధ్య నడుస్తున్నట్లు గబ గబ కొలువు ఇంటికి చేరింది.

అమ్మగారు తలుపు ఎదురుగా కుర్చీలో కూచుని పేపరు చదువుతూ కాఫీ తాగుతోంది. "ఏమే! ఈవేళ నువ్వొచ్చావు? మీ అమ్మ అయితే పొద్దున్నే వచ్చేది" అన్నది. లక్షింబాయికి ఈ అమ్మతో మాట్లాడ్డం అంటే ఇష్టం లేదు. ఆమె కూతురితో పాటు బళ్ళో చదువుకుంటున్నా ఎప్పుడూ తనని పనిమనిషిలాగానే చూస్తుంది. కానీ, మంచిగా ఒక్క మాట అనదు.

"ఎక్కడికో పనుండి వెళ్ళిందమ్మా" అంటూ గోనె పట్టా బయటే మొక్కల దగ్గర జాగ్రత్తగా పెట్టింది. పరికిణీ పైకి చెక్కుకుని గబగబ లోపలకు నడిచింది. చీపురు, బక్కెట్టు, ముగ్గు అన్నీ ఎక్కడుంటాయో తెలుసు ఆమెకు.

వాకిలి పని పూర్తయింది. గిన్నెలు, గ్లాసులు అడ్డదిడ్డంగా ఒక కుప్పగా పోసి వున్నాయి. అవన్నీ తీసుకెళ్ళి పెరట్లో వేసుకుని మెల్లగా తోమసాగింది.

"మీ అమ్మ వస్తుందా? పండక్కయినా ఇల్లు కడిగేది ఉందో లేదో? ఇల్లంతా మట్టి, బూజు మీకెంత పెట్టినా ఇంతేనే" అంటూ అమ్మగారు సాగదీస్తూ అంటోంది. మాట్లాడకుండా బాసన్లు తోముతోంది లక్షింబాయి.

"పదో క్లాసు ప్యాసయినావుగా! ఇంకా కొలువు రాలేదా నీకు? ఉద్యోగాలన్నీ మీవేగా!" అన్నది అమ్మగారు. రెండు కాఫీ గ్లాసులు తెచ్చి పడేస్తూ. లక్షింబాయి బలంగా తోమేస్తోంది. కొన్ని కడిగేస్తోంది. "ఇంతకూ మీ అమ్మ వస్తుందా?" అన్నది.

"వస్తుందమ్మా!" అన్నది తల వంచుకునే. నాకే కొలువైతే ఈ తిప్పలు దేనికి అన బుద్ధవుతోంది. మళ్ళీ వారం నాడు తను ఆస్పత్రికి వెళ్ళిపోతే నెలకు తొమ్మిది వందల రూపాయలు తెచ్చి పడేస్తుంది. ఈ ఆలోచన రాగానే ఏదో వెచ్చగా, ఆశగా లోపల కదులుతుంటే, వేగంగా గిన్నెలన్నీ బక్కెట్లో పడేసింది. అంత బరువూ ఆమె ఎత్తబోతోంటే కొమరమ్మ వచ్చింది.

"అన్నీ తోమేసినావా లక్షింబాయీ!" అంటూ గబుక్కున బక్కెట్టు అందుకుంది. ఆపేక్షగా ఆమె అడిగిన ప్రశ్న వినలేదు కూతురు. "జాగ్రత్తగా డబ్బిచ్చావా అమ్మా! ఆయనెప్పుడు రమ్మన్నడు? ఆస్పత్రి కొలువు ఎప్పుడవుతుందన్నాడు" అని అడగాలని చూస్తోంది. ఏ మాటా పైకి అనకుండానే చూపుతోనే ఆగిపోయింది కారణం.. అమ్మ ముఖంలో వెలుగుతున్న సంతోషం. "ఆరో తేదీన ఇంటర్వ్యూకి పిలుస్తారుట. కారటు పంపిస్తానని చెప్పాడు ఆఫీసరయ్య" అన్నది కూతురి సందేహాలు తీర్చేస్తూ. అమ్మేసుకున్న పసిడి గుళ్ళు గుర్తుకు రావడం లేదు ఆసమయంలో. తల్లీ కూతుళ్ళు రెట్టింపు సంతోషంతో పనులన్నీ చేసుకున్నారు. అమ్మగారిచ్చిన టీ ఇద్దరూ చెరో కప్పుతాగారు. వేడి వేడిగా కడుపులోకి టీ పోతుంటే, కొమరమ్మ మనస్సులోని సంతోషం దాచుకోలేక తను రెండువేల రూపాయలు ఇచ్చిన సంగతి, లక్షింబాయికి ఆస్పత్రి ఆయా కొలువు రాబోయే సంగతి అమ్మగారికి చెప్పింది.

"ఓసినీ! లంచమా! ఛీ, ఛీ అది గడ్డితో సమానం. తిన్నా తినిపించినా తప్పే అయినా, పది చదివి ఆయాలాగా ఆ కశ్మలమంతా తీస్తుందా లక్షింబాయి?" అన్నది చాలా వికారంగా ముఖం పెట్టి ఇది వింటున్న లక్షింబాయి టీ గుటక మింగలేకపోయింది.

"ఏం చెయ్యాలమ్మా? ఎయ్యిరూపాయల జీతం. పైన పేషెంట్లు ఇచ్చే డబ్బులు రెండేళ్ళు కష్టపడితే పర్మనెంటు అయితందట. దాని లగ్గానికైనా పైసలు కావాలి కదమ్మా! ఆమెనే దాసుకుంటది" అన్నది కొమరమ్మ ధైర్యంగా. అమ్మగారింక ఈ చర్చ పెంచలేదు.

ఇంకో గంట సేపు తల్లి కూతురు ఇంటెడు చాకిరీ చేసి అన్నం, పులుసు మూట గట్టుకుని ఇంటికి చేరారు. తను ఆఫీసరుకి రహస్యంగా ఎలా జబ్బు అందచేసినదీ దోవలో వివరించింది కొమరమ్మ.

ఇంటికి ఇంకా అంత దూరంలో ఉండగానే కొమరమ్మ బిగ్గరగా అరచింది "యాదయ్యొచ్చిండే!" అని ఇంటి తడక తలుపు దగ్గర నిలబడ్డ తమ్ముణ్ణి చూడగానే లక్షింబాయికి మతి పోయింది. పిల్లల జైలు నించి మళ్ళీ తప్పించుకుని వచ్చాడే దొంగవెధవ అని కోపం ముంచుకొచ్చింది.

తలుపు తాళం తీసి తటాలున తోసి లోపలికి వెడుతూనే, "మల్ల ఎందుకొచ్చినావురా?" అంది కొమరమ్మ.

"పోతాలేవే! అన్నం పెట్టు" అన్నాడు. వాడికి ఒక దు:ఖం లేదు. సిగ్గు లేదు, నీతి లేదు. చేర్పించిన చోటనల్లా దొంగతనాలు చేశాడు. డబ్బులు ఎత్తుకు పోయి సినిమాలు చూసేవాడు. ఒక పోలీసాఫీసరు కాళ్ళు పట్టుకుని, పిల్లల జైలు స్కూల్లో పడేయించింది కొమరమ్మ. అక్కడ కూడా అబ్బాయిలందరూ తిట్టుకుంటారు. కొట్టుకుంటారు. కానీ బయటికి రానివ్వకుండా తాళాలు వేసి బోనులో జంతువుల్లా పడేసి ఉంచుతారు. అదే నయమని తల్లి కూతురు సంతోషిస్తోంటే, మళ్ళీ మొదటికొచ్చాడు. ఇది రెండోసారి పారిపోయి రావడం.

"కాళ్ళు, చేతులు కడుక్కురా! అన్నం పెడతా" అన్నది లక్షింబాయి. అమ్మయితే కోపంతో వాడిని చావగొడుతుంది. ఎంతకని సాదాలి ఆతల్లి? "అమ్మా! నువ్వు ఏమనకు. తిని వాడే ఎల్లిపోతాడు" అన్నది. వాడు తిన్నాడు. కానీ, ఎక్కడికీ పోలేదు. ఉండిపోయాడు.నాలుగు రోజులు గడిచాయి. పొద్దున్న టీ తాగి, రోజూ ఏదో పనున్నట్లు పోవడం.తిరిగి తిరిగి వచ్చి అన్నం తినడం. ఏరా అంటే, "కొలువు కోసం చూస్తుండా"అంటాడు. కొమరమ్మ రోజూ ఎంప్లాయిమెంటు ఆఫీసుకు వెళ్ళి వస్తూనే ఉంది. రెండో తేదీ, మూడో తేదీ దాటాయి. ఆమెకు ఆతృత ఎక్కువైంది. చాలా పెద్ద గుంపు ఉంటున్నారు ఎంప్లాయిమెంటు ఆఫీసు దగ్గర. జనం లోంచి తోసుకుపోయి ఒక కిటికీ లోంచి చూస్తూ, టేబిలు దగ్గర కూర్చున్నాయన్ని, "లక్షింబాయి కారటు దవాఖానకు పంపారా అయ్యా?" అనడిగింది. అతను పట్టించుకోలేదు. అర్థం కానట్లే చూస్తున్నాడు. మిగిలిన వాళ్ళు ఇవతలకు తోయగా, వరండాలోకి వచ్చి పడింది కొమరమ్మ.

దేముడల్లే జీపు దిగి వచ్చాడు ఆఫీసరయ్య. "దణ్ణమయ్యా!" అన్నది. ఎంతో బాగా నవ్వాడు ఆఫీసరయ్య. "ఆరో తేదీకి లక్షింబాయి కారటు పంపినారయ్యా?" అన్నది. "ఆ.. ఆ... రేపు వెళ్ళమను. నంబరు తీసుకుని పొమ్మను" అన్నాడు లోపలకు వేగంగా వెళ్ళిపోతూ. "అయ్యా! కాగితం" అంటూ వెంట పరుగెత్తబోతోంటే గుమ్మం దగ్గర ప్యూను అడ్డు తగిలి ఆపేశాడు. లోపలకు వెళ్ళిపోయిన ఆయన తిరిగి ఎప్పటికీ రాలేదు. గంట, గంటన్నర కూచుంది. గొంతు ఎండిపోతోంటే, ఆవరణలోనే ఉన్న పంపు దగ్గర నీళ్ళు తాగుదామని వెళ్ళింది. కొమరమ్మ కొంగుతో ముఖం తుడుచుకుంటూ చూసేటప్పటికి జీపు వచ్చి మెట్ల దగ్గర ఆగడం, ఆయన ఎవరితోనో కలిసి ఎక్కడం కనిపించింది. ఆమె పరుగెత్తి ఎదురుపడేలోగానే జీపు వేగంగా గేటు వరకు వెళ్ళిపోయింది. ఈ సంగతి ఆలోచిస్తూ రాత్రంతా నిద్రలేదు కొమరమ్మకు. మర్నాడు పొద్దున్న ఆఫీసరయ్య ఇంటికే వెళ్ళింది. ఆయన లేరు. ఊరు వెళ్ళారని తెలుసుకుని బేజారయిపోయింది. ఆరోతేదీ వచ్చింది. వెళ్ళింది. లక్షింబాయికి ఆయా ఇంటర్వ్యూ రాలేదు. అక్కడికి వెడితే కూడా వినిపించుకునే

నాథుడు లేడు. మరో వారం తర్వాత ఆఫీసరయ్య కనిపించాడు. ఆశ్చర్య పోతున్నట్లు ముఖం పెట్టి, "రాలేదా? ఎందుకు రాలేదు? ఆఫీసుకు రా. కనుక్కుందాం" అన్నాడు.

ఆఫీసుకి వెళ్ళింది. అక్కడ మెరుపులా మెరిసి మాయమైపోయే అంత పెద్దాయనను ఎలా పట్టుకుంటుంది? రెండు వేలు తీసుకుంటివి కదయ్యా ఎందుకు కొలువు వేయించవు అని బజారున పడి అరుద్దామంటే పోలీసులు పట్టుకపోతారేమో! పిచ్చిదానిలా అక్కడ కూలబడింది. ఇలాంటి వాళ్ళను రోజూ చూడడం అలవాటైన ప్యూను ఒకతను సంగతేమిటని అడిగాడు. విషయమంతా చెప్పింది. కాస్త ఆలోచించి, "రెండు వేలతో ఏ పనీ నడవదమ్మా! కాగటు పంపటానికే ఆరువేలు తీసుకున్నరు. ఆడ కొలువు ఆర్డరైతే ఇరవై, ముప్పై ఏలలో ఉన్నయ్. సప్పుడు సేయక ఇంటి కెల్లిపో. ఆ అయ్యగారికి దయున్నప్పుడు ఏదో ఒకటి ఏపిస్తరు" అన్నాడు.

కొమరమ్మకు కళ్ళు తిరిగిపోతున్నాయి. గుండె బాదుకుని ఏడుద్దామంటే అందుకూ ఓపిక లేదు. నీరసంగా లేచి నడిచి నడిచి ఇల్లు చేరింది. "అమ్మా ఏంటమ్మా?" అని ఎదురొచ్చి తీసుకెళ్ళింది లక్షింబాయి.

బేజారైన తల్లికి ఇన్ని నీళ్ళు తాగించింది.

"అన్యాయమైపోయింది బిడ్డా" అని గగ్గోలుగా తల్లి ఏడుస్తోంటే ఏమైందని అడక్కుండానే వేడిగా టీ పోసి ఊరడించింది.

ఆమెకీ దు:ఖమొస్తోంది. ఎంత ఆశ పెట్టుకుంది. ఆ కొలువుపైన! రెండు వేల రూపాయలు జన్మలో కనిపించవు.

రెండు రోజులు ఒళ్ళెరుగని జ్వరం కొమరమ్మకి. నాలుగిళ్ళలో ఉన్న కొలువులు పోకుండా, ఈసురోమని ఈడ్చుకుంటూ వెళ్ళి లక్షింబాయి పని చేసి వస్తున్నది. తమ కథంతా తెలిసిన ఆ అమ్మగారు అడగనే అడిగింది "ఏమైందే నీ లంచం కొలువు?" అని.

నీరసం ముంచుకు రాగా "రాలేదమ్మా" అన్నది లక్షింబాయి.

"ఓరినీ! అన్ని డబ్బులూ తీసుకుని. మీ నోట్లో దుమ్ము కొట్టాడా! ఇంత కష్టపడే పేదవాళ్ళు, మీ కడుపు కొడితే వాడికి తిన్న అన్నం అరుగుతుందటే?" అని యథాశక్తి ఆవిడ కూడా శాపనార్థాలు పెట్టింది. సానుభూతి చూపింది. "మీకూ రాక, మాకూ రాక ఏమైపోతున్నాయే ఈ ఉద్యోగాలన్నీ?" అని నిజంగానే ఆశ్చర్యపోయింది.

ఎర్రని ఎండ కాస్తోంది. ఇంటికి వచ్చి, అమ్మగారిచ్చిన పులుసు అన్నం తాను తిని తల్లికి టీ కాచి పోసింది. డబల్ రొట్టె ముక్కలు కూడా తినలేదు కొమరమ్మ. నడిపించుకుని వెళ్ళి సూది మందు ఇప్పించి మళ్ళీ తీసుకొచ్చింది.

మధ్యాహ్నానికి జ్వరం కాస్త జారిందేమో. చెమట తుడుచుకోలేక, నిద్రపట్టక ఆరాటపడుతోంది. తటాలున తడక తోసుకుని లోపలికి వచ్చాడు యాదయ్య. "అన్నం పెట్టే" అన్నాడు లక్షింబాయికి ఒళ్ళు మండి పోయింది.

""పోరా పో! సంచుల నిండా బియ్యం తెచ్చి పోసినావ్! అన్నం వండి వార్చినా" అన్నది గట్టిగా.

రోగమొచ్చిన అమ్మ బతికిందో, చచ్చిందో వాడికి పట్టలేదు.

తిరుగుబోతు ఎదవకి తనే రెక్కలు అరగదీసుకొచ్చి తిండి పెట్టాలి.

"ఎందుకే నీకు కోపం? నిన్న మొన్న ఎట్ల తిరిగినమో తెలుసా? అరచి అరచి గొంతు పోయింది. ఈ దెబ్బకు ఇంక కొలువులన్నీ మనకేనే! ఏదు తప్పిన గానీ నాకు సర్కారు కొలువు వస్తది. ఊర్లల్లనైతే ఇంటికే

తీస్కపోయి ఆర్డరిస్త ఉన్నరు" అని సంతోషంగా చెప్పేస్తున్న తమ్ముడి వంక ఆశ్చర్యంగా చూసింది లక్షింబాయి. ఎక్కడివబ్బ అన్ని కొలువులు అనుకుంటున్నది.

"రిజర్వేషన్లే ఎర్రిమొగమా! ఏడాది కేడాది బొచ్చెడు కొలువులు వస్తుండాయి. ఈరోజు బాగా అరవాల. ఊరేగింపులో రాత్రి దాకా తిరగాల. మా పేర్లన్నీ రాపించుకున్నరు. ఈ గుడిసె నంబరు కూడా ఏపించుకున్నరు. నీ పేరు కూడా రాసేసి. మా అక్క పది పాసైనాదంటే తప్పక మంచి నౌకరీ దొరుకుతుందని సెప్పింర్రు. ఈ యాదిగాడు ఆవారాగాడనుకున్నవంటే అక్కా? ఎయ్యి రూపాయల కొలువు!" అని ఏకబిగిన ఉక్కిరిబిక్కిరిగా చెప్పి, "అన్నం పెట్టే అక్కా!" అని నోరారా అడిగాడు.

లక్ష్మింబాయి స్టవ్ ముట్టించి వేగంగా బియ్యం కడిగి పెట్టింది. ఒకటే తొందరపడుతున్నాడు వాడు.

"ఓసి! ఇది ఎన్నటికి ఉడకాల? డబల్ రొట్టె ఇలాగియ్యి" అని పులుసులో ముంచుకుని గబగబ నాలుగు ముక్కలు మింగి నీళ్ళు తాగాడు. అన్నం ఉడుకు పట్టకుండానే ఉరికి బయటపడ్డాడు.

పాపం యాదయ్య మంచోడే. తన కాళ్ళమీద తాను బతకాలని ఆడికి ఉంది. కానీ, దొరకందీ ఏంచేస్తడు? ఇంక మంచి రోజులొచ్చినయి ఇన్నేళ్ళు కష్టపడినోళ్ళందరికీ సర్కారు కొలువులు వస్తయి. రిజర్వేషను అనే మాట లక్షింబాయి కూడా విన్నది. పేదోళ్ళకి అది పెన్నిధి. పొంగిపోతూ, కమ్మని వాసన చిమ్ముతున్న అన్నాన్ని కలియబెడుతూ ఆలోచనల్లోపడింది లక్షింబాయి.

చీకటి పడిపోయింది. ఊరేగింపులో అరుస్తూ పోయిన యాదయ్య ఎటు పోయినాడో అయిపు లేదు. కొమరమ్మ కలవరింతగా, "ఎప్పుడొచ్చిండే. గింత బువ్వయిన తిన్నడా?" అనడిగి జవాబు వినకుండానే అటు తిరిగి పడుకుంది.

లారీల్లో, బస్సుల్లో కాలినడకన మనుష్యులు ఊరేగింపులో అమ్మాయిలు, అబ్బాయిలు జండాలు పట్టుకుని పేగులు కదిలేటట్లు కేకలు వేస్తున్నారు. వేసే అడుగుల్లో ఎంత ఊపు, ఎంత బలం? ఎర్రని చారలు తేలిన కళ్ళల్లో ఎన్నో ఆశలు! బతకాలని, బతకడానికి అన్నం కావాలని, రెక్కలు విరుచుకుని అన్నం సంపాదించుకుంటామని ఎలుగెత్తి చాటుతూ సాగే ప్రవాహంలో యాదయ్య ఒక చిన్న గడ్డి పరక. ఉన్నట్లుండి గందరగోళమైంది. తొక్కిసలాటైంది.ఎవరైనదీ చూడకుండా పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. లాఠీలు వీపుల పైన మోగాయి. గాలిలోకి పేల్చిన తుపాకీలు 'ప్రమాదవశాత్తు' జనం వేపు దూసుకున్నాయి. ఒకరో, యిద్దరో, పదిమందో నేల కొరిగారు. మరునాటి పేపరు వార్తకు, ఎర్రని మరకల చిత్రాలకు ముడి సరుకు దొరికింది. మినుకుమనే దీపం బుడ్డి వెలిగించింది లక్షింబాయి. మూలుగైనా లేకుండా పడి ఉన్న తల్లిమీద చేయి వేసి కాస్సేపటికి ఆదమరచి నిద్రపోయింది యాదయ్యకి కొలువు దొరుకుతుందని తియ్యని కలలు అలసిన ఆమె రెప్పల్లో తమ కష్టాలు గట్టెక్కుతాయనీ,లంచం తీసుకుని పలుకకుండా పోయిన ఆఫీసరు దొరుకుతాడనీ, పెద్ద ఆశ ఆ గుండెలో. ఆరోజు గడిచి పోయింది.

మరురోజు సాయంత్రానికి ఆ బస్తీలోకి చేరింది వార్త.కుర్రాళ్ళు కొందరు దెబ్బలు తగిలి ఆస్పత్రిలో ఉన్నారని, లక్షింబాయి నడక రానట్లు తడబడుతూ ఒకాయన్ని సాయం తీసుకుని వెళ్ళింది ఆస్పత్రికి.

రాత్రవుతోంటే తమ్ముడు యాదయ్యని గుర్తు పట్టింది. హక్కుల కోసం అరచి అరచి మూగబోయింది ఆ గొంతు. కడుపు నిండా అన్నం కావాలన్న వెర్రి ఆశతో నిండిన కళ్ళు మూసుకొని పోయాయి.

ఆశపడ్డ వారందరికీ ఉంటాయా కొలువులు? అసలు ఎవరికున్నాయి? కింది మనిషైనా, పై మనిషైనా ఈ పరిపాలనా మారణ యంత్రానికి ఒకటే. అక్షరం రాని వాడైనా, సర్వ శాస్త్ర పారంగతుడైనా, ఏ కులమైనా, ఏ గోత్రమైనా ఎవరికీ దొరకవు కొలువులు. రూపాయల గలగల ఒక్కటే వినబడే చెవిటి వారి చేతుల్లో చిక్కుకుని పోయాయి.

ఉద్యోగాలు కిందికి దిగిరాని గాలి పటాలు. 'లంచం' అనే రెండక్షరాల బ్రహ్మరాక్షసత్వం విశ్వరూపమై జగమంతా నిండి ఉన్నప్పుడు నీకా నాకా అని పంపకాలు ఎందుకు? పంతాలు ఎందుకు?

బతుకంటే ఏమిటో అర్థం కాని లక్ష్మింబాయికి ఒక్కసారిగా చావంటే ఏమిటో తెలిసి పోయింది. "ఓయమ్మో! యాదయ్య సచ్చిపోయిండే!" అని ఆమె పెట్టిన శోకం బస్తీలోని కొమరమ్మ గుండెలో ప్రతిధ్వనించింది.

**ఇండియా టు డే, 1992**